సాక్షి జగిత్యాల

ఆదివారం । 19 । నవంబర్ । 2023



ఆలయాల్లో కార్తీక సందడి

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది.



ఎమ్మెల్సీ కవిత వాహనం తనిఖీ

రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ నుంచి కట్కాపూర్‌కు వస్తుండగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాహనాన్ని ఒడ్డెలింగాపూర్ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఎస్‌టీ టీం సభ్యులు తనిఖీ చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/19.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి పెరుగుతుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్

జగిత్యాలజోన్: ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సిద్ధంగా ఉందని సంస్థ కార్యదర్శి, సబ్ జడ్జి కంచ ప్రసాద్ అన్నారు. జగిత్యాల స్పెషల్ సబ్ జైలును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. న్యాయవాదులను నియమించుకునే స్థోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందిస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కట్కం చంద్రమోహన్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.సతీశ్, విజయకృష్ణ, జైలర్ మొగిలేశ్, సంస్థ సిబ్బంది వెంకన్న, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల: జిల్లాలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం వీఆర్‌కే కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉన్నందున వీఆర్‌కే కళాశాలలో ఏర్పాట్లను ఈనెల 28లోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో లోటుపాట్లు రానీయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ వెంకటస్వామి, పంచాయతీరాజ్ ఈఈ రహమాన్, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, వ్యవసాయాధికారి సురేశ్ పాల్గొన్నారు.

అంజన్న అతిశీఘ్ర దర్శనానికి అనుమతి



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల శ్రేయస్సు.. ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవాదాయ శాఖ కమిషనర్ కొన్ని సేవలకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా భక్తులకు అతిశీఘ్ర దర్శనానికి రూ.300, వేదఆశీర్వచనం కోసం రూ.400 చొప్పున నిర్ణయించారు. ప్రత్యేక దర్శనం చేసుకున్న వారికి శాలువ, కండువాతో పాటు వేద పండితుల నుంచి ఆశీర్వచనం అందించేలాచూస్తామని ఈవో వెంకటేశ్ తెలిపారు.

పిల్లలను ప్రతిరోజూ బడికి పంపాలి




మాట్లాడుతున్న రాజీవ్

జగిత్యాల: పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రాజీవ్ అన్నారు. ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలు అమలవుతున్న జగిత్యాల, కొడిమ్యాల, చెప్యాల, పూడూరులోని పాఠశాలలను శనివారం సందర్శించారు. విద్యార్థుల అభ్యాసన ఫలితాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం బోధన చేయాలన్నారు. బేస్‌లైన్ పరీక్ష ఆధారంగా స్థాయి నిర్ధారణ చేసుకుని దానికి అనుగుణంగా బోధన చేయాలన్నారు. ఉన్నతి మార్గదర్శకాలు పాటించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, ప్రధానోపాధ్యాయుడు క్లాస్ టీచర్‌ను ప్రతిరోజూ అబ్జర్వ్ చేసి రికార్డు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వినయ్‌కుమార్, సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్ పాల్గొన్నారు.

నిద్రపోని నాయకులు!

నాయకా.. ఆరోగ్యం జాగ్రత్త

జంగ్ తెలంగాణ



- రోజుకు 4 గంటలు కూడా నిద్రపోని లీడర్లు
- అజీర్తి, లోబీపీతో బాధపడుతున్న వైనం
- డీజేల హోరుతో ఇబ్బందులు తప్పవంటున్న డాక్టర్లు
- షుగర్, హృద్రోగులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- పలుచోట్ల గాయపడుతున్న నాయకులు, కార్యకర్తలు

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. డీ హైడ్రేషన్ కారణంగా ఆమె అస్వస్థతకు గురయ్యారు. సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఇలా జరిగింది.

ఇటీవల పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడి ప్రచార ర్యాలీ జరిగింది. ఇందులో ఉత్సాహంగా పాల్గొన్న ఓ నాయకుడు ఉన్నట్టుండి గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే అతన్ని కరీంనగర్ తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరిగింది. ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ.. నాయకులు విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నారు. దాదాపు అన్ని పార్టీల అభ్యర్థులు ఉదయం 5 గంటలకే నిద్రలేస్తున్నారు. కొందరు రాత్రి 12 గంటల నుంచి ఒంటిగంట వరకమేలుకొనే ఉంటున్నారు. సీనియర్ నాయకులు, మంత్రులకు తమ నియోజకవర్గంతోపాటు అదనపు నియోజకవర్గాల బాధ్యతలు, స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న వారికి ఇతర నియోజకవర్గాల ప్రచార డ్యూటీలు కూడా ఉండటంతో నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ ఇటీవల తాను పాల్గొన్న ఓ సభలో వాంతి చేసుకున్నారు. సరైన నిద్ర, విశ్రాంతి లేకపోవడం వల్లే ఇలా అయిందని ఆయన అనుచరులు పేర్కొన్నారు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రతీరోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట ప్రచారం చేయాల్సి వస్తోంది. ఆయన కూడా ఇటీవల నిద్రలేక లోబీపీకి గురయ్యారు. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ ఆరోగ్యపరంగా పలు సమస్యలు చుట్టుముట్టే అవకాశాలున్నాయి.

ఎవరికి ఎంత నిద్ర అవసరం?

అప్పుడే పుట్టిన బిడ్డలు రోజుకు 15 గంటలు. ఒకటి నుంచి 3 ఏళ్లలోపు 12–15 గంటలు, 3–5 ఏళ్లవారు 11–15 గంటలు, 5–12 ఏళ్లవారు 9–11 గంటలు, 13–17 ఏళ్లవారు 8–10 గంటలు, 18–25 ఏళ్లవారు 7–9 గంటలు, 26–64 ఏళ్ల వరకు 7–9 గంటల పాటు నిద్రపోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	బరిలో
కరీంనగర్:	27
హుజూరాబాద్:	22
చొప్పదండి:	14
మానకొండూరు:	10
సిరిసిల్ల:	21
వేములవాడ:	16
పెద్దపల్లి	17
మంథని	21
రామగుండం	23
జగిత్యాల	15
కోరుట్ల	15
ధర్మపురి	15
మొత్తం	216

లేకపోతే ఏమవుతుంది?

ప్రస్తుతం పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల నాయకులందరూ రోజుకు 4 గంటలకు మించి నిద్రపోవడం లేదు. అర్ధరాత్రి వరకు మెలకువతో ఉండటం, తెల్లవారుజామున లేవడం వల్ల వారికి నిద్ర సరిపోవడం లేదు. ఫలితంగా బరువు పెరగటం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, బీపీ, గుండెజబ్బులు, మతిమరుపు వంటి సమస్యలు వచ్చి, చివరకు తీవ్ర అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సమయానికి భోజనం చేయకపోవడంతో షుగర్ బారిన పడుతున్నారని అంటున్నారు. కొందరు డీజేలతో ప్రచారం చేస్తున్నారు. దాని పక్కన డాన్సులు చేసే నాయకులు, కార్యకర్తలకు గుండెపోటు ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో కిందపడి, గాయాలపాలవుతున్నారు.

నిద్రలేమితో అనేక సమస్యలు



ప్రతీ మనిషికి 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం. నిద్రలేమి అనేక సమస్యలకు కారణమవుతుంది. ముఖ్యంగా ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, తలనొప్పి, నీరసం వంటివి వస్తాయి. ఎక్కువ రోజులు నిద్రలేమి ఉంటే బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన పడతారు. బరువు పెరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఇమ్యూనిటీ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ సాయిని నరేందర్, ఎండీ

నిరుపేదల సంక్షేమానికి సీఎం కృషి



సారంగాపూర్: బీర్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

- ప్రతిఒక్కరికీ జీవనభృతి అందిస్తాం
- జీవన్‌రెడ్డి ఏం అభివృద్ధి చేశారు..?
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

రాయికల్/సారంగాపూర్: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఆమె సారంగాపూర్‌తోపాటు రాయికల్ మండలంలోని మైతాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి, కట్కాపూర్, అల్లీపూర్‌లో రోడ్‌షో నిర్వహించారు. రాయికల్‌బస్టాండ్, గాంధీచౌక్ ఏరియాల్లో మాట్లాడుతూ.. మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకొస్తుందని, బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం, ఆసరా పింఛన్లు రూ.5వేలకు పెంపు, దివ్యాంగులకు రూ.6 వేలు, రైతుబంధు రూ.16వేలకు పెంపు, సౌభాగ్యలక్ష్మీ కింద రూ.3వేలు, గ్యాస్ సిలిండర్ రూ.400కే అందిస్తామని తెలిపారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలకు చేసిందేమిటో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన 30 ఏళ్ల పరిపాలనలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవన్‌రెడ్డి చేయని అభివృద్ధిని తాను ఐదేళ్లలో చేశానన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం పాటుపడేది కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.



రాయికల్: సభకు హాజరైన ప్రజలు

తండాలను కలిపి పంచాయతీ చేయిస్తా..

బీర్‌పూర్‌లోని ఆసునూరిగూడెం, కట్టకింద నాయికపుగూడెం, లంబాడి తండాలను కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయిస్తానని కవిత గిరిజనులకు మాటీ ఇచ్చారు. బీర్‌పూర్‌కు మంజూరైన గురుకులాన్ని ఇక్కడికే తీసుకురావడానికి కృషిచేస్తానన్నారు. మండలకేంద్రంలో డబుల్‌రోడ్డుగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని యువకులు కోరగా.. అంగీకరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, రాయికల్ ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు, సారంగాపూర్‌లో కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

జగిత్యాల:జగిత్యాలలో జీవన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జిల్లాకేంద్రంలో ప్రచారంలో పాల్గొన్నారు. 30ఏళ్లలో జీవన్‌రెడ్డి చేసింది శూన్యమన్నారు.



వైభవంగా గంగాహారతి

ధర్మపురి: గోదావరిలో గంగాహారతి కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాహారతి ఐదో రోజుకు చేరింది. ముందుగా ఆలయం నుంచి గోదావరి నది వద్దకు మేళతాళాలతో వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిలో దీపాలు వదిలారు. కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

ధర్మపురిని రెవెన్యూ డివిజన్ చేయాలి

- హామీలు తప్ప ఆచరణ శూన్యం
- ఎన్నికల అస్త్రంగా వాడుకుంటున్న వైనం

సాక్షి పీపుల్స్ ఎజెండా



ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయం

ధర్మపురి: ప్రభుత్వాలు మారుతున్నా ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మాత్రం మోక్షం కలగడం లేదు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని చెబుతున్న నాయకుల మాటలు నీటి మూటలవుతున్నాయి. జిల్లాలోనే అతిపెద్ద ఆలయమైన లక్ష్మీనృసింహస్వామి ఇక్కడ కొలువై ఉన్నారు. గ్రామ పంచాయతీ నుంచి మేజర్‌పంచాయతీ.. తర్వాత మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. పైగా నియోజకవర్గంగా కూడా మారింది. డివిజన్ ఏర్పాటుకు కావాల్సిన సకల సదుపాయాలున్నా అధికారులు, రాజకీయ ఒత్తిళ్లతో కల నెరవేరడం లేదు. ధర్మపురిని రెవెన్యూ డివిజన్ చేస్తే వెల్గటూర్, ఎండపెల్లి, ధర్మారం, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపెల్లి మండలాల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయంటున్నారు ఇక్కడి ప్రజలు.

పనుల్లో వేగం..



ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే అధికార యంత్రాంగమంతా ఇక్కడే ఉంటారు. ఎనిమిది మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. పనులన్నీ తొందరగా అవుతాయి. పైగా లక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రం కొత్తకళ సంతరించుకుంటుంది.

– రంగు లక్ష్మీనరహరి, ధర్మపురి

కోరిక నెరవేర్చాలి



రెవెన్యూ డివిజన్ అనేది ఇక్కడి ప్రజల చిరకాల కోరిక. గతంలో రెవెన్యూ డివిజన్‌కు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించాం. జిల్లాలో తక్కువ దూరంలోనే ఉన్న జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిని డివిజన్లు చేశారు. అదే ధర్మపురిని మాత్రం విస్మరించారు.

– దూడ మహిపాల్

పాలకులు దృష్టి సారించాలి



రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని సౌకర్యాలున్నా.. పాలకులు దృష్టి సారించక పోవడం బాధాకరం. డివిజన్ ఏర్పాటైతే వెల్గటూర్, ఎండపెల్లి, ధర్మపురి, బుగ్గారం, బీర్‌పూర్ మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– ఉమామహేశ్, రెవెన్యూ డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు

సేవలు త్వరగా అందుతాయి



రెవెన్యూ డివిజన్‌తో ఇక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. రైతులతోపాటు ఇతర అవసరాలు ఉన్న రైతుల సమస్యలకు తొందరగా పరిష్కారం దొరుకుతుంది. చుట్టూరా ఉన్న మండలాల ప్రజలకు ధర్మపురి అందుబాటులో ఉంటుంది.

– వేముల రాజు, ధర్మపురి

మున్సిపాలిటీలో సిబ్బంది ఉండటం లేదు

- కలెక్టర్‌కు వార్డు సభ్యురాలు జయశ్రీ ఫిర్యాదు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో ఉద్యోగులు ఒక్కరూ అందుబాటులో ఉండటం లేదని 35వ డివిజన్ కౌన్సిలర్ జయశ్రీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల విధుల పేరిట ఎగనామం పెడుతున్నారని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు కూడా ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదని పేర్కొన్నారు. కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఎలక్షన్ కోడ్ ఉందని, కౌన్సిలర్ల ఫోన్లు లిఫ్ట్ చేయొద్దని చెబుతున్నారని వివరించారు. ప్రజల పనులన్నీ మరుగున పడుతున్నాయని పేర్కొన్నారు. కార్యాలయానికి ఎప్పుడొచ్చినా తాళం వేసి ఉంటోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నిరుద్యోగ జేఏసీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోదండరాం తదితరులు

జగిత్యాలటౌన్: తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన మేనిఫెస్టోను తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీగార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, బండ శంకర్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ లంక నవీన్, కోకన్వీనర్లు కిషోర్, అశోక్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో అభ్యర్థుల వివరాలు



కేవైసీ యాప్

జగిత్యాల: నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) యాప్‌ను ఎన్నికల కమిషన్ రూపొందించింది. ఈ యాప్‌ను మొబైల్‌లో ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో అభ్యర్థుల వివరాలతో పాటు, వారు పొందుపర్చిన అఫిడవిట్‌లను పరిశీలించవచ్చు. దేశంలో జరుగుతున్న ఎన్నికలకు సంబంధించిన వివరాలన్నీ అందులో ఉంటాయి. రాష్ట్రం, నియోజకవర్గం ఎంపిక చేసుకుంటే క్షణాల్లోనే అభ్యర్థుల వివరాలు ప్రత్యక్షమవుతాయి.

వాహనాల తనిఖీ



వాహన తనిఖీల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని అమ్మక్కపేట వద్ద శనివారం సాయంత్రం ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో అక్రమంగా మద్యం, డబ్బు తీసుకెళ్తే కేసులు నమోదు చేయనున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వా హనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సి బ్బంది వాహాబ్, జలేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్: మండలంలోని ఘనపూర్‌కు చెందిన తిప్పారపు మీనయ్య(72) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు. మీనయ్య తన కుమారుడు సమ్మయ్య ఇంట్లో ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జోష్ పెంచేలా.. ఆకర్షించేలా..

- అభ్యర్థుల పేర్లతో పాటలు, పద్యాలు
- గానా.. భజానాతో ఆకట్టుకునే యత్నం
- కొత్త వ్యూహాలకు నాయకుల పదును



పెగడపల్లి(ధర్మపురి): ఎన్నికల్లో ప్రచారమంటే గతంలో కరపత్రాలు, గోడ రాతలు, గోడ పత్రికలు, స్టిక్కర్లకే పరిమితం అయ్యేవారు. ఇప్పుడు కొత్త వ్యూహాలకు పదును పెట్టారు. ఒక్కప్పుడు పార్టీ ప్రముఖుల రోడ్ షోలు, బహిరంగ సభలకు వస్తే పార్టీల గొప్పదనాన్ని వివరిస్తూ సినిమా స్టైల్‌లో పాటలు వచ్చేవి. కానీ ఇప్పుడు అభ్యర్థుల పేర్లతో సామాజిక మాధ్యమాల్లో గానా భజనాలు హల్‌చల్ చేస్తున్నాయి. యువతను ఉర్రూతలూగించేందుకు ఖర్చు ఎక్కువైనా సరే నాయకులు వెనకాడటం లేదు. ఒకరిని మించి మరొకరు తమ కార్యకర్తల్లో జోష్ పెంచేలా ఓటర్లను ఆకర్షించేలా మాటల మంత్రాన్ని జపిస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో ఇప్పుడు నాయకుల పేర్లతో ప్రచారాలు, పాటలు హోరెత్తుతున్నాయి.

క్యాడర్‌లో హుషార్

ఒకరి పేరు మీద.. వారు చేసిన అభివృద్ధి పైనా.. పార్టీ మెనిఫెస్టోలోని పదాలను క్రమ పద్ధతిలో పోగుచేసి పాట రూపంలో తీర్చిదిద్దుతున్నారు. దానికి హుషారెత్తించే సంగీతాన్ని సమకూర్చుతున్నారు. ఇదంతా ఈజీ కాదు. ఎవరికి తీసిపోని విధంగా భిన్నంగా చేసి ఇవ్వాలంటే కాస్తా ఖర్చుతో కూడుకున్నదే. అయినప్పటికీ ఎన్నికల రోజు వారీ ఖర్చుతో పోలిస్తే ఇది అంత పెద్దదేమి కాదనే భావన ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నాటుకుపోయింది. దేనికీ వెనకాడకుండా క్యాడర్‌లో జోష్ పెంచేలా, ఓటర్లను ఆకర్షించేలా వైవిద్యంగా పాటలు రాయించుకుంటున్నారు. వాటికి వీడియోలు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. అభ్యర్థులు ప్రజలతో మమేకమైనవి, అభివృద్ధిలో పాలు పంచుకున్నవి, పార్టీ పెద్దలతో సాన్నిహిత్యం గల చిత్రాలను జతచేసి ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు డ్రోన్ కెమెరాలు, అత్యాధునిక సాకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సినిమా పాటలకు తీసిపోనట్లుగా మైమరిపిస్తున్నాయి.

సామాజిక మాధ్యమాలే ప్రచారస్త్రాలు

గతంలో ఎన్నడు లేనంతగా వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లను ఈ ఎన్నికల్లో విరివిగా వాడుకుంటున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు ప్రత్యేకంగా గ్రాఫిక్స్‌తో తయారు చేయించిన చిత్రాలను, వీడియోలను అందులో పోస్టు చేస్తున్నారు. లైక్‌లు, షేర్లు, కామెంట్లకు కొదవ ఉండటం లేదు. తమ పార్టీ గొప్పదనం అభ్యర్థి మంచితనాన్ని పది మందిని ప్రేరేపించేలా గానా, భజానాతో అలరిస్తున్నారు.

మారుమోగుతున్న సెల్‌ఫోన్లు

ఇప్పుడు అందరి చేతుల్లోకి స్మార్ట్‌ఫోన్లు వచ్చాయి. దీనికి తగ్గట్లుగా అందులో ఉన్న ఆప్షన్లకు అమితాశక్తి చూపుతున్నారు. కార్యకర్తలకు ఏదైనా ఫోన్ కాల్ వచ్చినా తమ నేత పాటే రింగ్‌టోన్‌గా సెట్ చేసుకుంటున్నారు. మళ్లీ తమ నేతల దగ్గర తమ చిత్తశుద్ధి, అంకిత భావానికి ప్రతీక అవుతోందని ద్వితీయశ్రేణి నాయకులు కూడా అదే ఫాలో అవుతున్నారు. కొందరైతే సినిమాల్లోని రాజకీయ సన్నివేశాల సమయంలో వాడిన డైలాగ్‌లను తమ నాయకులకు అన్వయించుకుని రింగ్ టోన్‌గా పెట్టుకుని కొత్త ట్రెండు సృష్టిస్తున్నారు.

మహిళా సంఘాల ఓట్లపై పార్టీల నజర్

- గోప్యంగా వివరాలు సేకరిస్తున్న నాయకులు



జగిత్యాలరూరల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మహిళ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు దృష్టిసారించారు. ముమ్మర ప్రచారంతో పాటు, మహిళ సంఘాల వివరాలు సేకరిస్తూ వారి ఓట్లను రాబట్టేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గ్రామైక్య సంఘాల వివరాలతో పాటు, మహిళ సంఘాల వివరాలను గోప్యంగా సేకరిస్తున్నారు. మహిళ సభ్యుల బ్యాంక్ ఖాతాతో పాటు, సెల్‌నంబర్లను సేకరిస్తూ వారి ఓట్లను రాబట్టుకునేలా ప్రలోభపెట్టే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

వారిదే కీలకపాత్ర

గ్రామైక్య సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కొందరు రాజకీయ పార్టీల నాయకులకు మహిళ సంఘాల వివరాలు ఇస్తూ వారి మన్ననలు పొందుతున్నారు. సంఘాల వివరాలు, వారి వ్యక్తిగత వివరాలను ప్రధాన పార్టీలకు చెందిన వారికి అందిస్తున్నట్లు సమాచారం. రానున్న రోజుల్లో వారి ఓట్లను ఆకర్షించేలా ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

రహస్య సమావేశాలు

ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు గ్రామ మహిళ సంఘాలను మచ్చిక చేసుకునేలా గ్రామాల్లో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక ప్రధాన పార్టీ సమావేశం నిర్వహించగానే మరో పార్టీ వారు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారి ఓట్లను పొందేలా చూస్తున్నారు. వారు కోరిన విధంగా వాగ్దానాలు ఇస్తూ ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రక్షిత

రాయికల్(జగిత్యాల): మండలంలోని భూపతిపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన బొడ్డుపల్లి రక్షిత సికింద్రాబాద్‌లోని ఐఐసీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో సత్తాచాటింది. డాక్టర్ రామచంద్ర చేతుల మీదుగా శనివారం బహుమతి అందుకుంది. మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అంశంపై ఉపన్యాస పోటీల్లో రక్షిత ప్రతిభ కనబర్చి తృతీయస్థానం సాధించినట్లు సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు దాసరి రామస్వామి, చిన్నయ్య తెలిపారు. రక్షితను డీఈవో జగన్మోహన్ రెడ్డి, హెచ్ఎం రమణి, సర్పంచ్ చంద్రశేఖర్, విద్యా కమిటీ చైర్మన్ జె.ప్రసాద్, ఉపాధ్యాయులు గంగాధర్, మహేశ్, గంగరాజు, శంకర య్య, కార్తీక్, నర్సయ్య, చిన్నయ్య అభినందించారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర



మాట్లాడుతున్న బసవ రాజేంద్ర

జగిత్యాల: పోలింగ్ సిబ్బంది సందేహాలు నివృత్తి చేసి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర అన్నారు. ధర్మపురి తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు, ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. తొలుత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ నిర్వహించాలన్నారు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని పోలింగ్ సిబ్బందికి తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలోని పలు చెక్‌పోస్టులను పరిశీలించారు. కార్యక్రమంలో ధర్మపురి రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దివాకర, మాస్టర్ ట్రైనర్ తిరుపతి పాల్గొన్నారు.

కోరుట్లలో..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరుట్ల ఎన్నికల పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా అన్నారు. కోరుట్లలోని సెయింట్ ఫ్రాన్సెస్ హైస్కూల్‌లో ఈవీఎం రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలన్నారు. కోరుట్ల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సారంగాపూర్(జగిత్యాల): కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ (ఐఏఎస్) బసవ రాజేంద్ర శనివారం బీర్‌పూర్ మండలం కమ్మునూర్, మంగేళ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని వసతులపై వివరాలు తెలుసుకున్నారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో వెంకటకృష్ణరాజు తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



మురళీకృష్ణ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా ప్రాంతానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తహసీల్ చౌరస్తాకు చెందిన అనుమండ్ల వరలక్ష్మి, రాజేశంకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు మురళీకృష్ణ (22) డిగ్రీ పూర్తి చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.

కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి దుర్మరణం

- ఒకరికి తీవ్రగాయాలు



శ్రీధర్ (ఫైల్)



సంఘటన స్థలంలో శ్రీధర్ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం శివారు ఒడ్డెరకాలనీ వద్ద శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనగా ప్రభుత్వ ఉద్యోగి గుడికందుల శ్రీధర్ (45) అక్కడికక్కడే మృతిచెందాడు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గుడికందుల శ్రీధర్ రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం శ్రీధర్‌తో పాటు, అతడి సోదరి గంగవ్వ మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా కారు ఢీకొనడంతో శ్రీధర్ మృతిచెందగా, గంగవ్వకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడికి భార్య లత, కుమారుడు మహేందర్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం కూనవేనిపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సుధాకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వానరాసి శ్రీనివాస్ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. వంద చిన్న సంచుల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ప్రజలు వెంటనే 87126 56372 నంబర్, డయల్ 100కు తెలపాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, తిరుపతి, శ్రీను ఉన్నారు.

పుట్టలో పాలుపోసి వచ్చాక..

- పాముకాటుతో మహిళ మృతి



భారతి(ఫైల్)

మంథని: నాగుల పంచమి సందర్భంగా పుట్టలో పాలుపోసిన ఓ మహిళ.. తన కుటుంబసభ్యులను సల్లంగా చూడాలని వేడుకుంది. నాగదేవతకు పూజలుచేసింది. ఆ రాత్రే ఆమె అనూహ్యంగా పాముకాటుకు గురై ప్రాణాలు విడిచింది. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బొడ్డెల భారతి(40) శుక్రవారం రాత్రి పాముకాటుతో మృతి చెందింది. ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో కింద వేసుకున్న దుప్పట్లలో దూరిన పాము భారతినికాటు వేసింది. ఏదో కుట్టినట్లుగా ఉండడంతో నిద్రలేచేసరికి పాము కనిపించిందని, శరరంపై గాట్లు కూడా ఉండడంతో వెంటనే స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు.. గోదావరిఖని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచింది. కాగా మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే నాగులపంచమి సందర్భంగా పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించిన సదరు మహిళ.. పాముకాటుకు గురికావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

తేమ తిప్పలు



సింగరావుపేట కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం
- రోజూ ఆరబెట్టడమే రైతన్నల పని
- ఆకాశంలో మబ్బులతో అన్నదాతల ఆందోళన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి పొలాలు కో యించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే నిబంధనల మేరకు ధాన్యంలో 17 శాతం తేమ రాకపోవడంతో కొనుగోళ్లు అనుకున్నస్థాయిలో జరగడం లేదు. వాతావరణంలో మార్పులతో ఆకాశమంతా మబ్బులతో నిండి ఉండి, అప్పుడప్పుడు చిరుజల్లులు కురుస్తుండటంతో ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు పెద్ద సమస్యగా మారింది.

కేంద్రాల ప్రారంభం అంతంతే..

జిల్లాలో 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 65 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా. ఆ మేరకు 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే, అక్కడక్కడ మినహా కేంద్రాలు పెద్దగా ప్రారంభం అయిన దాఖలాలు లేవు. ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండటంతో, ధాన్యంలో తేమ ఉందనే సాకుతో నిర్వాహకులు కేంద్రాలను ప్రారంభించడంలో తాత్సారం చేస్తున్నారు. చాలా మండలాల్లో అక్కడక్కడా కేంద్రాలను ఇటీవల ప్రారంభించినా కొనుగోళ్లు సాఫీగా సాగడం లేదు. ప్రారంభమైన కేంద్రాల్లో తేమ శాతం రాకపోవడంతోనే ధాన్యం తూకం వేయడం లేదని నిర్వాహకులు దాటవేస్తున్నారు.


ఆరబెట్టడం పెద్ద సవాల్

ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు పెద్ద సవాల్‌గా మారింది. కేంద్రాల్లో సరైన స్థలాల లేకపోవడం, కూలీల సమస్య నెలకొంది. అయినా రైతులు రోజుకు రెండుమూడు సార్లు ధాన్యాన్ని కిందకు, మీదకు అంటూ ఆరబెడుతున్నా తేమ శాతం రావడం లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో ధాన్యం కుప్పలపై మంచు ఏర్పడి ఆరడానికి సమయం పడుతుంది. అలాగే వాతావరణ మార్పులతో పగటి ఉష్ణోగ్రతలు కూడా పడిపోయి ధాన్యంలో తేమ శాతం రావడం లేదు. దీంతో రైతులు ఎక్కడికక్కడే రోడ్లపై ధాన్యం ఆరబెట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధాన్యం కుప్పల వద్దే నిరీక్షిస్తున్నారు.

తూకం అయ్యేందుకు మరిన్నిరోజులు

ధాన్యంలో తేమ శాతం రావడం ఒక ఎత్తైతే తేమ శాతం వచ్చిన ధాన్యం తూకం వేయడం మరో ఎత్తుగా మారింది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో సాయంత్రం తేమ శాతం వస్తే, ఉదయం చూసే సరికి తేమ శాతం రావడం లేదు. దీంతో కేంద్రాల నిర్వాహకులు తూకం వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఈక్రమంలో కేంద్రాలన్నీ ధాన్యంతో నిండిపోయి తూకం వేయడం మరింత సమస్యగా మారే అవకాశం ఉంది. రైతులందరి ధాన్యం తూకం కావాలంటే దాదాపు డిసెంబర్ చివరి వరకు కొనుగోళ్లు జరిగే అవకాశం ఉంది. అయితే ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు పడితే యాసంగి పంటలకు ఎలా సిద్ధమవడం అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు.


ఎన్ని రోజులవుతదో..



మూడెకరాల పొలం కోయించి కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన. ఆకాశంలో మబ్బులతో ధాన్యంలో తేమ శాతం సరిగ్గా రావడం లేదు. దీంతో కొనుగోళ్లు పూర్తయ్యేవరకు మరెన్ని రోజులు పడుతుందో అర్థం కావడం లేదు.

– కోల నారాయణ, చల్‌గల్, జగిత్యాలరూరల్

రోజూ ఆరబెట్టడమే..



వరి పంట పండించడం ఒక ఎత్తైతే ధాన్యం అమ్ముకోవడం కష్టంగా మారింది. ధాన్యంలో తేమ ఉందని తూకం వేయడం లేదు. అసలే చలికాలం, మంచు కురుస్తుంది. ఉదయం వచ్చి ధాన్యంలో తేమ శాతం చూసేవరకు రావడం లేదు. రోజూ ధాన్యం ఆరబెట్టడంతోనే సరిపోతుంది.

– సంగెపు జీవన్‌రెడ్డి, లక్ష్మీపూర్, జగిత్యాలరూరల్

రెండు ఆలయాల్లో చోరీ



హుండీ ఎత్తుకెళ్తున్న దొంగ (సీసీ ఫుటేజీ)

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని పలు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలోని సాయిబాబా, రాజరాజేశ్వర ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హుండీలను పగలగొట్టారు. భక్తులు వేసిన నగదు, కానుకలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వెళ్లిన పలువురు హుండీలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రెండు ఆలయాల్లో దాదాపు రూ.80 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. సాయిబాబా ఆలయంలో కొన్నిరోజుల క్రితమే హుండీ లెక్కించాలని నిర్ణయించుకున్న కమిటీ సభ్యులు అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. త్వరలోనే హుండీ తెరిచి లెక్కిస్తామనుకునేలోపే చోరీ జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వాటర్ ఫౌంటెన్‌లో పడి మున్సిపల్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం: ప్రమాదవశాత్తు వాటర్ ఫౌంటెన్‌లో పడి, ఓ మున్సిపల్ కార్మికుడు మృతిచెందాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగం మండలంలోని నల్లకుంటపల్లికి చెందిన కసిపాక నర్సయ్య(55) మున్సిపాలిటీలోని వాటర్‌వర్క్స్ విభాగంలో పని చేస్తున్నారు. గత కొంతకాలంగా అనార్యోగంతో బాధ పడుతున్నాడు. ప్రస్తుతం కోర్టు చౌరస్తాలో గల వాటర్ ఫౌంటెన్ వద్ద డ్యూటీ చేస్తున్నాడు. శనివారం సాయంత్రం 5 గంటలకు చౌరస్తాలోని లైట్లను ఆఫ్ చేయడానికి వచ్చిన ఓ కార్మికుడికి నీటిలో నర్సయ్య మృతదేహం కనిపించింది. అతను పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): కారులో తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి తెలిపారు. శనివారం మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో వాహనాల తనిఖీ నిర్వహించగా ఓ వ్యక్తి కారులో తరలిస్తున్న రూ.20,500 విలువ గల 60 లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. పట్టుబడిన మద్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కరీంనగర్ పరిధిలో..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్‌లోని ఓ కిరాణా షాపులో శనివారం 36 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అడిచెర్ల అనంతరాములు కిరాణా దుకాణంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. రూ.3,010 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలుడిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన బాలుడిపై దాడిచేసిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. చిలుకవాడకు చెందిన ఒడ్నాల శ్రీనివాస్ కుమారుడు ఉదయ్‌కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన ప్రభాకర్ దాడి చేశాడు. తన ఇంట్లో విద్యుత్ వైర్లు చోరీ చేశాడని అనుమానంతో శనివారం బాలుడిని మోతె శివారులోకి తీసుకెళ్లి దాడిచేసి గాయపరిచాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ప్రభాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బుల్లి వరల్డ్ కప్



నరేశ్



బంగారు వరల్డ్ కప్

కోరుట్ల: మన దేశ క్రికెట్ జట్టు వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. ఆదివారం కప్ గెలవాలని ఆశిస్తూ కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన స్వర్ణకారుడు తుమ్మనపల్లి నరేశ్ బంగారు బుల్లి వరల్డ్ కప్‌ను రూపొందించాడు. నరేశ్ తయారు చేసిన బుల్లి ప్రపంచ కప్ కేవలం 0.90 మిల్లీ గ్రాముల బరువు మాత్రమే ఉంటుంది. క్రికెట్‌పై అభిమానంతో ప్రపంచ కప్ నమూనాలో బంగారు బుల్లి వరల్డ్ కప్ తయారు చేసిన అతడిని క్రికెట్ అభిమానులు అభినందించారు.